క్లుప్తంగా

నేటినుంచి బండపాలెంలో ధనుర్మాస ఉత్సవాలు

కోదాడ : పట్టణ పరిధిలోని బండపాలెం శ్రీదేవల్ బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం నుంచి జనవరి 14వతేదీ వరకు తిరుపతి తిరుమల దేవస్థానం అళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు ముడుంబై రామలక్ష్మణాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9గంటలకు ప్రవచనాలు ప్రారంభమవుతాయని, కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వ్రతములో భాగస్వాములు కావాలని కోరారు.

నేటి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో నేటి నుంచి వచ్చే నెల 13వతేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మార్పీఎస్ పట్టణ నూతన కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు బచ్చలకూడి ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా చింతిర్యాల నాగయ్య, ప్రధాన కార్యదర్శిగా మంద నాగరాజు, కార్యదర్శిగా సోమపంగు రవీంద్ర, గౌరవ సలహాదారులుగా గల్లా వెంకటేశ్వర్లు, కస్తాల శ్రవణ్, మీసాల శరత్, మీసాల కిరణ్, మంద వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు సీహెచ్ బాలచంద్రుడు, ఎస్.వినోద్, ఎం.మట్టయ్య, ఎం.గోపి, ఎ.మహేష్, ఎం.లక్ష్మయ్య, ఏసు, కార్తీక్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న దాతలు, నిర్వాహకులు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్‌రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్పమాలధారులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఎస్‌ఎస్పీ ఉద్యోగి అయితనబోయిన వెంకటనారాయణ ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 400మంది మాలధారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, మాలధారులు, తదితరులు ఉన్నారు.

బీసీలకు అన్ని రంగాలలో ప్రాధాన్యం ఇవ్వాలి

నడిగూడెం : బీసీలకు అన్ని రంగాలలో ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ హక్కుల సాధన సమితి నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు మండవ నాగమణి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 75ఏళ్లుగా అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగం ప్రకారం రాజ్యాధికారం బీసీలకు ఇవ్వాలని కోరారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టి జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

మాలల సింహగర్జన సభకు వెళ్లిన నాయకులు

హుజూర్‌నగర్ : అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏపీలోని గుంటూరులో జరిగే మాలల సింహగర్జన సభకు పట్టణం నుంచి ఆదివారం ఆ సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డి.బాబురావు, కె.రాజా, కె.కళ్యాణ్, వి.నగేష్, జి.రాము, వినోద్, ప్రవీణ్, రంజిత్, బాబు, రాము, సాగర్, దశరథ్, రాజు, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

లస్కర్, పంప్ ఆపరేటర్లను రెగ్యులరైజ్ చేయాలి

హుజూర్‌నగర్ : నీటిపారుదల శాఖలో ఏళ్లుగా పనిచేస్తున్న లస్కర్, వాచ్‌మెన్, పంప్ ఆపరేటర్లను రెగ్యులరైజ్ చేయాలని లిఫ్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా సెక్రటరీ ప్రసాద్ కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అతి తక్కువ వేతనాలతో 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. సమావేశంలో సంఘం సభ్యులు కె.శ్రీను, వి.రాము, మహేష్, వెంకట్, అప్పారావు, గోపి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

భవనం శిథిలం.. విధులకు ఆటంకం

- పెచ్చులూడుతున్న వ్యవసాయ కార్యాలయ పైభాగం
- బిక్కుబిక్కుమంటూ అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణ
- రికార్డులు, పత్రాలు పెట్టడానికి కూడా సరైన సౌకర్యం లేక ఇబ్బందులు



శిథిలావస్థకు చేరుకున్న సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం



పెచ్చులూడిన భవనం పైభాగం

కోదాడరూరల్ : కోదాడ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. 53 ఏళ్ల క్రితం నిర్మించినది కావడంతో భవనం పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారింది. దీంతో భవనం పెచ్చులూడిన చోట అధికారులు తమ సొంత ఖర్చులతో రెండళ్ల క్రితం తాత్కాలిక మరమ్మతులు చేయించారు. కానీ భవనం మరోచోట పెచ్చులూడుతునే ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అధికారులు, సిబ్బంది విధులకు హాజరయ్యేందుకు జంకుతున్నారు. కోదాడ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో లక్ష 59 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలకు సంబంధించిన పలు కార్యకలాపాలు ఈ కార్యాలయంలోనే కొనసాగిస్తుంటారు. అయినా కార్యాలయంలో విలువైన రికార్డులు, కంప్యూటర్లు, ఫర్నిచర్ ఉంచడానికి సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు.

వర్షాకాలంలో నీరు చేరి..

వర్షాకాలంలో అధికారులు, సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కు మంటూ కార్యాలయానికి రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ రోజులు వర్షాలు కురిస్తే భవనం చెమ్మకారుతుండడంతో ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పైగా వర్షాకాలంలో కార్యాలయంలోని రికార్డులు, పత్రాలు కూడా తడిసే ప్రమాదం ఉంది. కార్యాలయ ఆవరణలోకి నీరు చేరి అక్కడే నిల్వ ఉంటుందని వారు చెబుతున్నారు. అయితే ఏడాది కిందట నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులు.. ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదని అంటున్నారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే రైతులకు కూడా ఎలాంటి వసతులు లేవు.

1988లో కేటాయింపు..

కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో భాగంగా 1971లో రైతుల విశ్రాంతి భవనం నిర్మించారు. రైతుల విశ్రాంతి భవనంగా కొనసాగుతున్న ఈ కార్యాలయాన్నే 1988లో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కర్షక పరిషత్ పథకం కింద వ్యవసాయ శాఖకు అప్పగించారు. నాటి నుంచి వ్యవసాయ శాఖ కార్యాలయంగా కొనసాగుతోంది. ఏడీఏతో పాటు ఏఓ, ఐదుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ఆక్రమణపై అధికారుల విచారణ..

పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయం పక్కన కోదాడ వ్యవసాయ శాఖకు సంబంధించిన స్థలం ఉంది. ఆ స్థలం ఆక్రమణకు గురైన విషయాన్ని ఇటీవల సాక్షి వెలుగులోకి తేగా రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. మొత్తం స్థలం ఎంత, ఎంత మేర అక్రమణకు గురైందన్న వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపించారు. దీంతో నూతన వ్యవసాయ శాఖ భవనం నిర్మాణంలో కదలిక వచ్చింది. నూతన భవనం మంజూరైతే అక్రమణదారులను ఖాళీ చేసి అక్కడ నిర్మిస్తారా లేదా ప్రస్తుతం ఉన్న స్థలంలోనే పాత భవనాన్ని కూల్చివేసి అక్కడే నిర్మిస్తారా అనేది అధికారులు తేల్చాల్సి ఉంది.

నూతన భవనం నిర్మించాలి



కోదాడ వ్యవసాయ కార్యాలయం పాతదైంది. దానిని కూల్చి వేసి కొత్త భవనం నిర్మించాలి. అధికారులతో పాటు రైతులకు అన్ని వసతులు ఉండేలా భవనం నిర్మిస్తే బాగుంటుంది.

– అన్నెం పాపిరెడ్డి, రైతు, రామలక్ష్మీపురం

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం



కోదాడ వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేశాం. నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని నివేదిక కూడా అందజేశాం. మరమ్మతులకు లేదా నూతన భవన నిర్మాణ నిధుల కోసం వేచి చూస్తున్నాం.

– యల్లయ్య, ఏడీఏ, కోదాడ

కనుల పండువగా దత్త జయంతి



వ్రతంలో పాల్గొన్న మహిళలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని షిరిడీసాయి సమాజం ఆధ్వర్యంలో ఆదివారం దత్త జయంతిని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిరంలో సాయిబాబా, దత్తాత్రేయ మూలమూర్తులకు పంచామృతాలతో అభిషేకం అనంతరం అనఘాదేవి వ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పూలతో బాబాకు పుష్పార్చన, తీర్థప్రసాదాల వితరణ గావించారు. కార్యక్రమాలలో అర్చకులు జానకిరామశర్మ, షిరిడీసాయి సమాజం నిర్వాహకులు టి.అంజయ్య, వి.నాగేశ్వరరావు, ఎ.రాము, వెంకటలక్ష్మి, వి.వెంకయ్య, కె.శ్రీనివాసరావు, జి.రమేష్‌బాబు, రాంబాబు, కె.నందయ్య, సైదారత్నం, రమేష్, వి.నరసింహారావు, పి.నరసింహారావు, నాగేశ్వరరావు, రజని, పద్మావతి, రాణి, ఇందిర, లక్ష్మి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన



నిరసనలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ, సీపీఎం జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయా పార్టీల నాయకులు మాట్లాడారు. పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సోమవారం గ్రామంలో నిర్వహించే జనరల్‌బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. గ్రామంలో నిర్మిస్తున్న ఎస్ఎంకే ఇథనాల్ పరిశ్రమతో గ్రామ పరిసర ప్రజలకు ప్రమాదకరంగా మారనుందన్నారు. ఆ పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు పోరాటం ఉధృతం చేయడానికి రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల సైదులు, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కాకి మోహన్‌రెడ్డి, దేసోజు మధు, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఎలుగు మధు, సీపీఎం మండల కమిటీ సభ్యుడు సోమగాని మల్లయ్య, సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి ఎర్రబోయిన మల్సూర్, కొప్పు వెంకన్న, సామ నర్సిరెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, ఉప్పలయ్య, లవగయ్య పాల్గొన్నారు.

కోదాడలో ప్రశాంతంగా గ్రూప్–2 పరీక్ష

- తొలిరోజు 45.71శాతం హాజరు
- పలు సెంటర్లకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు



కోదాడలో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న నిర్వాహకులు

కోదాడ : పట్టణంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–2 పరీక్ష తొలిరోజు ప్రశాంతంగా ముగింది. ఈ పరీక్షకు అధికారులు నియోజకవర్గంలో 19సెంటర్లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని 16సెంటర్లు, అనంతగిరిలో ఒకటి, చిలుకూరు మండల పరిధిలో 2సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు 7887మంది హాజరు కావాల్సి ఉండగా పేపర్–1కు కేవలం 3605మంది, సాయంత్రం పేపర్–2కు 3605 మంది హాజరయ్యారు. తొలిరోజు 45.71శాతంగా నమోదైనట్లు గ్రూప్–2 పరీక్షల కోదాడ రీజినల్ కోఆర్డినేటర్ బోళ్ల సైదిరెడ్డి వెల్లడించారు.

నిమిషం నిబంధనతో ఇబ్బందులు..

నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించకపోవడంతో పలువురు అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. పట్టణంలోని 16సెంటర్లలో 13మంది అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. మరికొంత మంది సెంటర్ల పేరులో ఉన్న చిన్నచిన్న తేడాలను గుర్తించక ఇబ్బందిపడ్డారు. సూర్యాపేట సమీపంలోని ముప్పారం గ్రామానికి చెందిన మల్సూర్‌కు కోదాడ సమీపంలోని శ్రీరంగాపురంలో గల శ్రీవాగ్దేవి సెంటర్ కేటాయించారు. గూగుల్ మ్యాప్‌తో రావడంతో అది పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వెనుక ఉన్న వాగ్దేవి కళాశాలను చూపించింది. అక్కడ కాదని తెలుసుకొని శ్రీరంగాపురం అడ్రస్ కనుక్కొని వెళ్లే సరికి ఆలస్యం కావడంతో పరీక్ష రాయలేకపోయాడు.

చిలుకూరు : ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన గ్రూప్–2 పరీక్ష ప్రశాంతగా ముగిసింది. మండలంలో మిట్స్, గేట్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా గదిలోకి అనుమతి ఇచ్చారు.



కోదాడ : పరీక్షకు వెళ్తూ తమ కుమారులకు టాటా చెబుతున్న తల్లి



చిలుకూరు : మిట్స్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద తనిఖీలో పాల్గొన్న ఎస్ఐ రాంబాబు

రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



గుడిబండలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడరూరల్ : రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని, వ్యవసాయ పరపతి సహకార సంఘాలు రైతులకు తోడ్పాటును అందించాలని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గుడిబండలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షాపింగ్ కాంప్లెక్స్, కాపుగల్లులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం గోదాములను డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రైతు రుణమాఫీ చేసిందని, సన్నధాన్యానికి రూ.500బోనస్ రైతుల ఖాతాలో జమ చేసిందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని అధిక ధర వచ్చినప్పుడు విక్రయించుకునేందుకు నిర్మించిన గోదాములను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత చివరి ఆయకట్టులోని భూములు ఎండకుండా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో లిఫ్టలను నిర్మిస్తున్నామన్నారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ మాట్లాడారు. రైతులకు అనేక రకాల రుణాలతో పాటు ఎరువులు, విత్తనాలు సహకార సంఘాల ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే వ్యవసాయ యంత్రాలు, సబ్సిడీపై రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, టీపీసీసీ సభ్యులు సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, డీసీఓ జి.శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్‌లు ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, నంబూరి సూర్యం, మాజీ ఎంపీపీ మల్లెల రాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తొండపు సతీష్, ఇర్ల సీతారాంరెడ్డి ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం..

నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. మండలంలోని గుడిబండ, తొగర్రాయి, చిమిర్యాల, మంగళితండా, రెడ్లకుంటలలో రూ.2.80కోట్లతో నూతన గ్రామపంచాయతీ భవనాలు, బీటీ, సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ఆమె మాట్లాడారు. విడతల వారీగా అన్ని రోడ్లను డబుల్, బీటీరోడ్లుగా నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొత్త రఘుపతి, ఇర్ల నర్సింహారెడ్డి, తూమాటి నాగిరెడ్డి, అమరనేని వెంకటేశ్వరరావు, సాధినేని అప్పారావు, కుక్కడపు నాగరాజు, కొత్త గుర్వయ్య, గంగవరపు లక్ష్మణ్‌రావు, జబ్బార్, ధరావత్ నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రెడ్లకుంటలో జీపీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



మునగాల : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

మునగాల : అర్హులైన పేదలకు స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం మండలంలోని కొక్కిరేణిలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీ సంవత్సరం పూర్తయినప్పటికీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో పదేళ్లుగా అనేక పేద కుటుంబాలు నేటికి పూరిగుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నారని, తక్షణమే వారిని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. పేదవర్గాల కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని, సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమం చేపడుతుందన్నారు. ఆయన వెంట పార్టీ మండల కమిటీ సభ్యులు రేఖ లింగయ్య, శాఖ కార్యదర్శి నందిగామ సైదులు, మాజీ సర్పంచ్ రావులపెంట వెంకన్న, నాయకులు రావులపెంట బ్రహ్మం, మిట్టగణుపుల సైదులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. పట్టణంలోని 14వ వార్డులో జరిగిన సర్వేలో కౌన్సిలర్ ఇందిరాల త్రివేణి పాల్గొని మాట్లాడారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఏఈ రాజశేఖర్, ఆర్పీలు నళిని, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : సర్వే నిర్వహిస్తున్న అధికారులు

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : వాడవాడలా సీపీఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులను కోరారు. ఆదివారం మండల పరిధిలోని గానుగబండ గ్రామంలో పార్టీ వంద సంవత్సరాల వేడుకలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన ఈ వంద సంవత్సరాలలో ప్రజల తరుపున అనేక పోరాటాలు నిర్వహించిందని, దేశం కోసం వేలాది మంది వీరులను త్యాగం చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, కుందూరు వెంకట్‌రెడ్డి, పంగ సైదులు, మెండె లింగరాజు, తాళ్ల తిరపయ్య, నబిసాహెబ్, పీర్ సాహెబ్, నర్సింహారావు, ఈశ్వరాచారి, వెంకటేశ్వర్లు, అచ్చయ్య, ఆంజనేయులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

అనంతగిరి : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామపంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు డేగ హనుమంతు, నెమ్మాది ఉపేందర్, కష్టాల ఏసయ్య, కుక్కల కిరణ్, కోకల హనుమంతరావు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలలో పాతవారినే కొనసాగించాలి

మునగాల : సాగర్ ఎడమకాల్వపై ఉన్న ఎత్తిపోతల పథకాలలో 25ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న పాత సిబ్బందినే యధావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉడుం కృష్ణ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత సిబ్బందిని కొనసాగిస్తూ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నూతన సిబ్బందిని ఆయా పోస్టులలో భర్తీ చేయాలనే ఆలోచనను విరమించుకోవాలన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీ నిర్వాహకులు ఎత్తిపోతల పథకాలలో ఆపరేటర్లు, లస్కర్లు, వాచ్‌మెన్‌ల ఉద్యోగాల భర్తీ కోసం అక్రమాలకు పాల్పడుతూ పలు ప్రాంతాలలో అధికార పార్టీ నాయకులు రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కోదాడ, హుజుర్‌నగర్ నియోజకవర్గాలలో అధికార పార్టీ నాయకుల అక్రమాల గురించి మంత్రి, ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

19న మాదిగ మహాగర్జనకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న చింత బాబు

నడిగూడెం : హైదరాబాద్‌లో ఈ నెల 19న నిర్వహించనున్న మాదిగ మహాగర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు చింత బాబు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని కాగితరామచంద్రాపురంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీకి స్వాగతం పలికి అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 70శాతం ఉన్న మాదిగలకు సముచిత స్థానం జరగడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బాణాల అబ్రహాం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి నరహరి, నాయకులు బొలెపొంగు కాశయ్య, నారకట్ల ప్రసాద్, పిడమర్తి వెంకటనారాయణ, అమరారపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట : రెడ్డి సంక్షేమ సంఘం సూర్యాపేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంపును పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీసీసీ సభ్యుడు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని బేబీమూన్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హైదరాబాద్ యశోద ఆస్పత్రికి చెందిన 13మంది వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో పేదలకు బీపీ, షుగర్, ఈసీజీ, కార్డియాలజీ, బోన్ స్కానింగ్ పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. గతంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసినట్లు పేర్కొన్నారు. స్థానిక వ్యాపారుడు యామా ప్రభాకర్ రూ. 15వేల మందులను అందించారని తెలిపారు.అనంతరం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీటెక్ చదువుతున్న పేద విద్యార్థి మండడి రోహిత్‌కు ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంజద్‌అలీ, అభినయ్, కరీమ్‌బేగ్, కరుణాకర్ రెడ్డి, నర్సయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం



ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నేరేడుచర్ల : ఢిల్లీలో రైతులు శాంతియుతంగా నిరసన చేస్తుంటే వారిపై కేంద్ర ప్రభుత్వం బయోగ్యాస్‌ను ఉపయోగించడాన్ని నిరసిస్తూ సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే పోలీసులు అమానుషంగా బయోగ్యాస్‌ను ఉపయోగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంబటి భిక్షం, వాసా పల్లయ్య, సయ్యద్‌హుస్సేన్, వాస కరుణాకర్, లక్ష్మి, పావని, వినయ్‌కుమార్, రజాక్, నాగేంద్ర, యాదగిరి, దేవయ్య, పుల్లమ్మ తదితరులున్నారు.